సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 9 | ఆగస్టు | 2023



బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. - 8లో▸



అడవే అమ్మఒడి..

బాహ్య ప్రపంచానికి సంబంధం లేని జీవన విధానం ఆదివాసీలది. ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా.. ఇప్పటికీ వారి ఆచారాలను అలాగే కొనసాగిస్తున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32°/26°

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వేడుకలను విజయవంతం చేయాలి



కాటారం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(బుధవారం) కాటారం మండల కేంద్రంలో నిర్వహించనున్న వేడుకలను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ తెలిపారు. కాటారం మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం జిల్లాలో ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆదివాసీలు, మేధావులు, ప్రజలు, కవులు, కళాకారులు, మహిళలు, యువతీ యువకులు, ఉద్యోగులు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కావుల విజయ్, పెండరి స్వామి, శ్రీదేవి పాల్గొన్నారు.

ముంపు గ్రామాల బాధితుల తరలింపు



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని పోస్టు మెట్రిక్ హాస్టల్‌లోని పునరావాస కేంద్రంలో తలదాచుకున్న మల్యాల గ్రామానికి చెందిన 48మందిని అధికారులు మంగళవారం స్వగ్రామానికి తరలించారు. ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ వీరస్వామి వరద బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు వాహనంలో స్వగ్రామానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, రాములు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల బియ్యం పంపిణీ



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని బుర్గుపేట వరద బాధితులకు పెద్దపల్లి జిల్లా ట్రస్మా అధ్యక్షుడు కేశవరెడ్డి, స్పందన మోడల్ స్కూల్ కరస్పాండెంట్ ఓదేలు యాదవ్, సావరిన్ స్కూల్ కరస్పాండెంట్ సమ్మిరెడ్డి, సిద్దార్థ పాఠశాల కరస్పాండెంట్ టంగుటూరి రాజయ్య తమ పాఠశాలల్లోని విద్యార్థుల నుంచి సేకరించిన 40 క్వింటాళ్ల బియ్యాన్ని ఎస్సై తాజుద్దీన్ చేతుల మీదుగా బాధితులకు పంపిణీ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల నుంచి 50 కిలోల వరకు అందజేశారు. బాధితులకు బియ్యాన్ని అందించిన ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లను ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు కర్ణాకర్ రావు, రవీందర్‌రెడ్డి, సర్పంచ్ సేద సారంగం, ఉప సర్పంచ్ గొర్రె దిలీప్ ఉన్నారు.

కార్మికులను వేధించడం తగదు



కన్నాయిగూడెం: దేవాదుల చొక్కారావు ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్‌లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను సంస్థ వేధింపులకు గురి చేయడం తగదని వెంటనే మానుకోవాలని భారత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి అన్నారు. చింతగట్టులోని దేవాదుల సీఈ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు రవి మాట్లాడుతూ.. దేవాదుల పంపింగ్‌లోని లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్ త్రీలో పని చేస్తున్న కార్మికులను వేధించడం మానుకోవాలన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పని గంటలను తగ్గించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దేవాదుల సీఈకి వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు



పోరుబాట

15నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె
- క్రమబద్ధీకరణ, తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్
- రోజువారీగా నిరసన కార్యక్రమాలకు పిలుపు

భూపాలపల్లి అర్బన్: వైద్యారోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పోరుబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. దాదాపు 20ఏళ్లుగా రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రెగ్యులర్ చేయాల్సింది పోయి ఖాళీల భర్తీకోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మొదటి, రెండవ ఏఎన్ఎంలు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 13 ప్రాథమిక, ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ఉన్నాయి. దాదాపు 90మంది ఏఎన్ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు వారిలో 60మంది కాంట్రాక్ట్ ప్రాతిపాదికన పని చేస్తున్నారు. వీరు సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు.

వినతులు, పోరాటాలు..

నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా 2007లో రూ.4,200 వేతనంతో రెండో ఏఎన్ఎంలు విధుల్లో చేరారు. వీరి వేతనాన్ని 2017లో ప్రభుత్వం రూ.25వేలకు పెంచింది. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్ఎంలకు దీటుగా వీరు పనిచేస్తున్నారు. తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించి, హెల్త్ కార్డులు జారీచేయాలని మొదటి, రెండవ ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. దురదృష్టవశాత్తు చనిపోతే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబసభ్యుల్లో ఒకరికి అర్హతను బట్టి కారుణ్య నియామకం చేపట్టాలని ఎమ్మెల్యేలు, మంత్రులకు సైతం పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చి సమ్మె చేశారు. సమ్మె చేసినప్పుడు పరిశీలిస్తామని హామీ ఇచ్చిన పాలకులు తర్వాత ఆ అంశాన్ని పక్కన పెడుతూ వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుండడంతో తమను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న ఏఎన్ఎంలపై దాడి చేయడమే కాకుండా ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులకు నిరసనగా జిల్లా కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనలు చేపట్టారు. అనంతరం స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

పోరాటం సాగుతుండగానే నోటిఫికేషన్

ఒకవైపు ఏఎన్ఎంలు తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుండగానే ప్రభుత్వం 1,500 ఏఎన్ఎంల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మొదటి, సెకండ్ ఏఎన్ఎంలలో ఆందోళన నెలకొంది. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను ఎప్పటికైనా రెగ్యులర్ చేయకపోతారా అని ఆశగా ఎదురు చూస్తున్న వారికి తాజాగా ప్రభుత్వం షాక్ ఇచ్చింది.

క్రమబద్ధీకరించాలి..



ఉద్యోగాల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ప్రకటన చేయాలి. మంత్రి హరీశ్ రావు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ ఏఎన్ఎంలకు సమానంగా పనిచేస్తున్నాం. పనికితగ్గ వేతనం ఇవ్వాలి.

- మాచర్ల సాధన, తాడిచర్ల

నోటిఫికేషన్ రద్దు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలి. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫలమైంది.

- కృష్ణవేణి, భూపాలపల్లి

మాతోనే గుర్తింపు..



ఏఎన్ఎంల సేవలతోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక అవార్డులు కైవసం చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ స్కీం ఎన్‌హెచ్ఎం అని చెప్పి దాటవేసే ధోరణి సరికాదు. తమ సమస్యలు పరిష్కరించి రెగ్యులర్ చేయాలి.

- లద్దునూరి పద్మ, చల్లగరిగే

సమ్మెకు సిద్ధం..



త్వరలోనే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు క్లస్టర్ల వారీగా సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రెగ్యులర్ చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

- పార్వతి, గణపురం

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కలెక్టర్ భవేష్‌మిశ్రా



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు, నెల వారి టార్గెట్‌లు, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, ప్రసవాల సంఖ్య, హాజరు, సెలవులు తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో, నిబద్ధతతో అప్రమత్తంగా పనిచేయాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం వైద్యసేవలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పటిష్టమైన చర్యలు తీసుకుందన్నారు. మెరుగైన వసతులు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్లక్ష్య ధోరణి కనిపించడానికి వీలులేదన్నారు. వైద్యులు సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. విధులు సక్రమంగా నిర్వహించని వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు ఐక్య పోరాటం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

భూపాలపల్లి రూరల్:/కాటారం: నూతన పెన్షన్ విధానం రద్దుకోసం సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏకమై ఐక్యపోరాటం చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ.దిల్షాద్ అన్నారు. మంగళవారం కాటారం మండలంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, భూపాలపల్లి పట్టణంలో చలో హైదరాబాద్ బహిరంగ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం సామాజిక భద్రత లేక సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వీస్ పెన్షన్ సాధించుకోవాలంటే ఉద్యమించక తప్పదని తెలిపారు. అసెంబ్లీ రద్దు కాకముందే సీపీఎస్ రద్దుకు కావాల్సిన జీఓను ఇప్పించుకోవాలన్నారు. ఉద్యోగులు, సీపీఎస్ రద్దు కోరుతూ ఈ నెల 12న నిర్వహించనున్న చలో హైదరాబాద్ బహిరంగ సభకు సీపీఎస్, ఓపీఎస్ అనే తేడా లేకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చలో హైదరాబాద్ బహిరంగ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, పాలిటెక్నిక్ అధ్యాపకులు కుమారస్వామి, ఎల్లస్వామి, రామరాజు, శ్రీనివాస్, పూర్ణసాయి, కిరణ్‌రావు, స్వర్ణలత, నవ్య, కలీం, రవికుమార్, సతీశ్, నాగేశ్వర్, సాంబరాజు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామి



భూపాలపల్లి రూరల్: భారత జాగృతి దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా భూపాలపల్లి మండలం గుర్రంపేట గ్రామానికి చెందిన కొయ్యడ కుమారస్వామిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్ రెడ్డి తెలిపారు. కుమారస్వామికి మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నియామకపత్రం అందించారు. నమ్మకంతో తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌క్వాస్ బృందం పరిశీలన



మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

మల్హర్(మహాముత్తారం): మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి హెల్త్ అండ్ వెల్‌నెస్ (హెచ్‌డబ్ల్యూసీ) సెంటర్‌ను ఎన్‌క్వాస్ గుర్తింపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందం మంగళవారం పరిశీలించింది. సభ్యులు మంగ్లారమ్, విష్ణోయి, కీర్తిమాన్ మహన్తా ఆస్పత్రి నిర్వహణ, వైద్యసేవల తీరు, పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలతో పాటు ఆస్పత్రిలో సంబంధించిన పలు అంశాలపై వివరాలు సేకరించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సందీప్, డిస్ట్రిక్ క్వాలిటీ మేనేజర్ భానుకుమార్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి శ్రీదేవి, ఉమాదేవి, డీపీఓ చిరంజీవి, డిస్ట్రిక్ ఏపీడల మిస్ట్ భాష్యనాయక్, డీడీఎం మధు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



ప్రమాదాలు జరిగితే సత్వర స్పందన



రిహార్సల్ చేస్తున్న జిల్లా డిజాస్టర్ టీం

గణపురం: ప్రమాదాలు జరిగితే సత్వరంగా స్పందించేందుకు పోలీసు విపత్తు రక్షక దళాలు పనిచేస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రమాదాలు జరిగితే రక్షణ ఎలా ఉంటుందో మంగళవారం గణపసముద్రం చెరువులో 20మంది సభ్యులతో కూడిన పోలీసు విపత్తు రక్షక దళాలు రిహార్సల్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలు, ఆస్తులు, కాపాడేందుకు జిల్లా పోలీసు విపత్తు రక్షక దళాలు పనిచేస్తాయని చెప్పారు. వరదల సమయంలో కలెక్టర్, ఎస్పీ చాలా అద్భుతంగా పనిచేశారని కితాబిచ్చారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ వరదల సమయంలో రెస్క్యూలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యానని, ఆ పరిస్థితిని అధిగమించేందుకు జిల్లా పోలీసుశాఖలో చురుకైన యువ పోలీసులకు శిక్షణ ఇచ్చి జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్పీ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు కఠిన శిక్షణ ఇచ్చారని, విపత్తును ఎదుర్కొనేందుకు, సమర్థవంతంగా పనిచేసేందుకు ఇప్పటికే ఒక బోటు కొనుగోలు చేశామని తెలిపారు. కొద్దిరోజుల్లో మరో బోటు కొనుగోలు చేస్తామన్నారు. బోట్లను కాళేశ్వరం పర్యాటకుల, భక్తుల రక్షణ కోసం వినియోగించనున్నామని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ పుల్లా కరుణాకర్ మాట్లాడుతూ.. వరదలు, జిల్లాలో ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే పోలీసు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్సుతో సత్వర సాయం, రెస్క్యూ, ఉంటుందన్నారు. జిల్లాలో రెండు స్పీడ్ బోట్లు కాటారం, భూపాలపల్లి డీఎస్పీల ఆధ్వర్యంలో పనిచేస్తాయని తెలిపారు. భవిష్యత్‌లో ప్రమాదాలు, ఆపద ఎదురైనా ప్రజలను కాపాడడానికి జిల్లా పోలీసు విపత్తు రక్షక దళాలు ముందుంటాయని అన్నారు. వరదలు, ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు ఎదురైనప్పుడు సమర్థవంతంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ అశోక్‌కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ రాములు, చిట్యాల సీఐ వేణుచందర్, గణపురం ఎస్ఐ సాంబమూర్తి, మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఓసీపీ నీటికి సంబంధించిన మ్యాప్‌ను అదనపు కలెక్టర్‌కు చూపిస్తున్న ఏఎమ్మార్ అధికారులు

మల్హర్: ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మండలంలోని ఎడ్లపల్లి బొగ్గుల వాగు, తాడిచర్ల శివారులో నిర్మిస్తున్న ఆర్అండ్ఆర్ కాలనీ పనులు, తాడిచర్ల ఊర చెరువు, పెద్దతాడిచర్ల డేంజర్ నివాస గృహాలను అదనపు కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాడిచర్ల శివారులో నిర్మిస్తున్న ఆర్అండ్ఆర్ కాలనీలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మోడల్ కాలనీగా ఏర్పాటు చేసి నిర్వాసితులకు ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. తాడిచర్ల ఊర చెరువులోకి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు నీళ్లను శుద్ధిచేసిన తర్వాత పంపించాలన్నారు. చెరువులోకి స్థాయికి మించి నీళ్లను విడుదల చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని మానేరులోకి పంపించే ప్రయత్నాలు చేయాలని ఏఎమ్మార్ అధికారులను ఆదేశించారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

అర్హులైన నిరుపేదలు ఈనెల 10వ తేదీలోపు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి గృహలక్ష్మి దరఖాస్తులను ఆరా తీశారు. సొంత స్థలం ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు ఇస్తుందని చెప్పారు. ఈ పథకం కింద స్థలం దస్తా వేజులు, ఆరోగ్య భద్రత కార్డు, ఇంటి పన్ను రసీదు తదితర ప్రతాలతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, తహసీల్దార్ వై.శ్రీనివాస్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ అశోక్, ఇరిగేషన్ ఏఈఈ రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్'



ములుగు రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి 30వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమర యోధులను, పోలీసులను సన్మానించుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 13 నుంచి 15 వరకు ప్రతీ ఇల్లు, కార్యాలయాలు, రహదారి కూడళ్ల వద్ద జాతీయ జెండాల ఆవిష్కరణ కార్యక్రమాలను ప్రతీ బూత్ స్థాయిలో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడప భిక్షపతి, కొత్త సురేందర్, బలరాం, రాకేష్‌యాదవ్, రాంబాబు, కారుపోతుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ములుగు: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ములుగు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాయక్‌పోడ్ వాడలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకున్నారు. ఈ మేరకు మండల పరిషత్ నిధులతో మంగళవారం ఎంపీపీ కొబ్బరి కాయ కొట్టి పని ప్రారంభించి బోర్ వేయించారు. ఆమె వెంట బీఆర్ఎస్ ములుగు మాజీ పట్టణ అధ్యక్షుడు మెరుగు సంతోష్, స్థానికులు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలి

మంత్రులు సత్యవతి, వేముల ప్రశాంత్ రెడ్డికి ఎమ్మెల్యే సీతక్క వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీతక్క

ములుగు : భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రోడ్లు , భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని ములుగు ఎమ్మెల్యే సీతక్క మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ భారీ వర్షాలతో ములుగు నియోజకవర్గంలో అపారమైన ఆస్తి, ప్రాణనష్టం జరిగిందన్నారు. వాగులు ఉప్పొంగి పలు గ్రామాలు నీటమునిగి ప్రజలు సర్వస్వం కోల్పోయారన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వరదల్లో కొట్టుకుపోయి మృతిచెందిన కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జిలు దెబ్బతిన్నాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి తక్షణం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రులు సీఎం కేసీఆర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సీతక్క వివరించారు.

గుణాత్మక విద్య అందించాలి



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంగపేట: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా తరగతి వారీగా సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 2వ తేదీ నుంచి కొనసాగుతున్న మౌళిక భాషా గణిత సామర్థ్యాల సాధన (తొలిమెట్టు)పై మండల స్థాయి మూడు దశల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించగా ఈ సమావేశానికి డిఈఓ పాణిని హాజరై శిక్షణ పొందిన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో బోధించే ఉపాధ్యాయులు తొలిమెట్టు కార్యక్రమం ద్వారా పిల్లల్లో గుణాత్మక విద్యను పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డీఈఓను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తొలిమెట్టు శిక్షణ కోర్స్ డైరెక్టర్ మేనక, నోడల్ అధికారి రవి, రిసోర్స్ పర్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 9వతేదీ నుంచి ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 9, 11, 14, 16, 18 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ఆస్తిలో వాటా కోసం .. నిరసన

- మాజీ ఎంపీ కల్పనాదేవి వారసుడి ఆందోళన



తల్లిదండ్రుల ఫొటోలతో నిరసన చేస్తున్న మాజీ ఎంపీ కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి

హన్మకొండ చౌరస్తా: తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా తన సోదరుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మాజీ ఎంపీ, దివంగత కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్తిలో తన వాటా ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ హనుమకొండ పద్మాక్షికాలనీలోని జయ నర్సింగ్ కళాశాల ఎదుట మంగళవారం అమ్మ, నాన్న ఫొటోలను వెంటబెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉరితాళ్లతో నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న పలువురు స్థానికులు జయసింహారెడ్డి ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆస్తిలో భాగమైన 60 ఎకరాలను తనకు తెలియకుండా సోదరుడు నర్సింగరెడ్డి రియల్ ఎస్టేట్‌కు అప్పగించాడని, వారసత్వ ఆస్తుల లెక్కలు తేల్చకుండా పత్రాలను దాచిపెట్టి తనకు వాటా దక్కకుండా ఒక్కడే అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా నర్సింగరెడ్డి తన ఆస్తుల, ఆదాయ లెక్కలను తేల్చి తనకు రావాల్సిన వాటా ఇవ్వకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు.

అడవే అమ్మఒడి..

విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం ఏజెన్సీ గూడేలు

- ప్రకృతితోనే జీవన గమనం
- పూర్వీకుల నుంచి ఆచరణ
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం : చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో కొండలు..గుట్టలు, ఆ మధ్యలో ఆవసాలు.. వాటి చుట్టు ఉండే వాగులు.. వంకలు..సెలయేరులు.. అటవీ జంతువులతో సహవాసం.. ప్రకృతితో మమేకం. ఇవి ఆదివాసీల జీవన విధానానికి ప్రతీక. బహ్య ప్రపంచానికి ఏ మాత్రం సంబంధం లేని జీవన విధానం వారి సొంతం. మైదాన ప్రాంత భాష, అలవాట్లు, ఆచారం, ఆహార్యానికి పూర్తి విరుద్ధం. ప్రపంచం కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా ఇప్పటికీ తమ ఆచారం, సంప్రదాయం, సంస్కృతులను అలాగే కొనసాగిస్తున్నారు. అడవిలో లభించే దుంపలు..ఇతర కాయలు ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. నీరు, అటవీ ప్రాంతాలనే ఆసరా చేసుకుని నాడు పూర్వీకులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నాటి ఆవాసాలే నేటి ఆదివాసీ గూడేలు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సమావేశం

ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. 1982 ఆగస్టు 9న జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల సంఘం నిపుణులతో సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను పరిరక్షించడంతోపాటు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 70 దేశాల్లో 5వేల తెగలకు చెందిన 40 కోట్ల జనాభా ఉందని సమాచారం. ఆదివాసీలు 6700 భాషలు మాట్లాడుతున్నారు. దేశంలో 461 రకాల ఆదివాసీ తెగలు ఉండగా 92 శాతం వరకు అటవీ ప్రాంతంలో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అడవులు, కొండలతో నిండి ఉంటుంది. గూడేలు, పెంటల్లో ఆదివాసీ మానవ సమాజం తొలిబిడ్డలు గోండు, కోయ, కోలాం, ప్రర్ధాన్, నాయక్‌పోడ్, బగత, జాతపు, కొండారెడ్డి, చెంచు, ఖోందు, అంధ్, ముఖదొర, ఆరోగ్యం మున్నెంవార్ వంటి జాతులున్నాయి.



కొమ్ము నృత్యం చేస్తున్న దింసా కళాకారులు (ఫైల్)

విద్య, వైద్యం కోసం నేటికీ పోరాటాలే..

అంతర్జాతీయంగా ఆదివాసీల సమస్యలు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, పర్యావరణం వంటి అంశాల పరిరక్షణకు సమితి సర్వప్రతినిధి సభ 1993లోనే తీర్మానం చేసింది. కాగా, జిగురు, బంక, ఇప్పపువ్వు, తునికాకు, చింతపండు, తేనె, చీపుర్లు, విస్తారాకులు, కలప, తదితర అటవీ ఉత్పత్తులపై ఇప్పటికీ ఆదివాసీలు ఆధారపడి జీవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. విద్య, వైద్యం కోసం ఇప్పటికీ ఏదో చోటా పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆదివాసీల చట్టాలు

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఉన్నా వనరులు దోపిడీ అవుతున్నాయని ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం వచ్చిన క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6546 మందికి మందికి పోడు పట్టాలు ఇచ్చారు.



చింతలమోరి గొత్తికోయగూడెం

గూడేల్లో సౌకర్యాలు కరువు

స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మౌలిక వసతులు లేక ఆదివాసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలకు ప్రభుత్వాలు ఇప్పటి వరకూ కనీస వసతులు కల్పించలేకపోయాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంటున్నారనే ఒకే కారణం వారికి శాపంగా మారింది. రోడ్లు ఉండవు.. తాగు నీరు లేదు. విద్యుత్ సరఫరా, పక్కా ఇళ్లు, పాఠశాలలు, పౌష్టికాహారం కూడా లేని దీనస్థితిలో గొత్తికోయలు కాలం వెళ్లదీస్తున్నారు.

నృత్యాలు

ఆదివాసీలోని పలు రకాల తెగల్లో ఒక్కొక్కరు ఒక్క రకమైన నృత్యం చేస్తారు. ఇందులో కొమ్ము నృత్యం, దింసా, డోలు నృత్యాలు ఉంటాయి. ఈ నృత్యాలు పెళ్లిళ్లు, జాతర, పండుగల సమయంలో ఎక్కువగా చేస్తారు.



కంతనపల్లి అడవిలో నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)

ఆదివాసీల హక్కులను కాపాడాలి



ఆదివాసీల హక్కులను కాపాడాలి. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు పాలకులు మారినా ఆదివాసీల రాతలు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ పథకాలు కింది స్థాయికి చేరితేనే అభివృద్ధి సాధ్యం. దీనిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడాలి.

– కొప్పుల సరిత, ఆదివాసీ మహిళ, ఏటూరునాగారం

సంస్కృతిని పరిరక్షించాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా చూడాలి. పండుగలు, ఆచారాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. వాటికి ప్రత్యేక ప్యాకేజీ కల్పించి ఘనంగా జరపాలి.

– కబ్బాక శ్రావణ్, ఏటూరునాగారం

ఆచారాలు, సంప్రదాయాలు

కోయ మహిళలు నేల మీదే ప్రసవిస్తారు. మంత్రసానులు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టిలో వేసి బారసాల చేయడం వారి ఆచారం. పిల్లల పేర్లు ఇలవెల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువగా ఉంటాయి.

పండుగలు.. దేవతలు

కోయల పండుగలు విభిన్నం.. విశిష్టం. వీరు ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండగ, సూరాల పండుగ, సుంకుల పండుగ చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకుంటారు.

బావమరిది మృతదేహం తీసుకొస్తుండగా ప్రమాదం.. బావ మృతి

మరిపెడ/బయ్యారం: అనారోగ్యంతో చనిపోయిన బావమరిది మృతదేహన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ మృతిచెందాడు. ఈ దుర్ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన ముద్ద సారయ్య(40) బావమరిది అదే గ్రామానికి చెందిన గజ్జి సంపత్(43) హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతన్ని మృతదేహాన్ని బావ సారయ్య ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మరిపెడ మీదుగా స్వగ్రామానికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై కాలువవెంట నిర్మించిన రోడ్డు వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ముందు కూర్చున్న సారయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అందులో ప్రయాణిస్తున్న గజ్జి అప్పయ్య, డ్రైవర్ శివకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.




సారయ్య(ఫైల్) సంపత్ (ఫైల్)

రైలుకు వెళ్లినా బతికేవాడు..

సారయ్య భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బావమరిది సంపత్ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి సారపాక వెళ్లేందుకు రైలు టికెట్ సైతం రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ బావమరిది చనిపోవడంతో అంబులెన్స్‌లో రావాల్సి వచ్చింది. రైలుకు వెళ్లినా ప్రాణంతో ఉండేవాడని బంధువులు విలపించారు.



పక్కపక్కనే పేర్చిన బావ, బావమరుదుల చితిల వద్ద విషాదంలో బంధువులు

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం



సభలో ఐక్యతా అభివాదం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ నాయకులు

- కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కు తిరిగేందుకు రూ.79 కోట్ల ఖర్చు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పబ్లిక్‌గార్డెన్‌లో 'బహుజన విద్యార్థి భరోసా' సభ

హన్మకొండ చౌరస్తా: బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విద్యార్థులను పట్టించుకోని కేసీఆర్ దుకాణం బంద్ చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతి భవన్ మధ్య తిరగడానికి ఏడాదికి రూ.79 కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మంగళవారం 'బహుజన విద్యార్థి భరోసా' సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. అంతకుముందు అదాలత్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు, అనంతరం విద్యార్థులతో కలిసి బైక్ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పేపర్ లీకేజీ సమయంలో అందరికీ అందుబాటులో ఉచితంగా కోచింగ్ మెటీరియల్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, కానీ బహుజనుల రాజ్యంలో ఏసీ కోచింగ్ సెంటర్లు, ఉచితంగా వైఫై, కంప్యూటర్ సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. బహుజన రాజ్యంలో పేపర్ లీకేజీలు ఉండవని, అలాంటి నేరాలకు పాల్పడితే యావజ్జీవ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో 90శాతం మందు దొరుకుతుంది కానీ వైద్యం అందడం లేదని మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన 200 ఎకరాలు భూమిని దొంగలు కబ్జా చేశారని ఆరోపించారు. దళిత, బీసీ, మైనారిటీ బంధు పేర్లతో కేసీఆర్ వస్తున్నాడు కానీ ఆయన దుకాణం బంద్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఆర్ఎస్‌పీ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ విద్యార్థి మేనిఫెస్టోను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్, బొట్ల కార్తీక్, మాదారపు రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణక్వీన్, వరంగల్ రీజియల్ సెక్రటరీ కన్నం సునీల్, జిల్లా నాయకులు సారయ్య, మంద శ్యాం, శనిగరపు రాజు, రజిత, లక్ష్మీ పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇంటి సామగ్రి కడుగుతుండగా..

- పాము కాటు.. చికిత్స పొందుతూ వివాహిత మృతి
- పలివేల్పులలో ఘటన



పద్మ (ఫైల్)

హసన్‌పర్తి : ఇంటి సామగ్రి కడుగుతుండగా పాము కాటు వేసింది. దీంతో ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం నగరంలోని పలువేల్పులలో జరిగింది. పలివేల్పులకు చెందిన సల్లా పద్మ(38) ఉదయం ఇంటి ఆవరణలో సామగ్రి (బోళ్లు) కడుగుతుండగా పాము కాటు వేసింది. వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య..

అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బైరి సాంబరెడ్డి(58), అవసరాల నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పు చేశారు. తీర్చే మార్గం కనిపించక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, మృతుల కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లావెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్‌చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు యువతి యత్నం



చికిత్స పొందుతున్న ప్రభావతి

గూడూరు: ప్రియుడి పెళ్లికి నిరాకరించాడనే కారణంతో ఓ యువతి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ ప్రభావతి, శివాలయం వీధికి చెందిన కస్నబోయిన కార్తీక్ ప్రేమించుకుంటున్నారు. కాగా, కార్తీక్ పెళ్లి నిరాకరిస్తున్నాడని ప్రభావతి ఆదివారం అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. అదే రోజు రాత్రి కార్తీక్ నర్సంపేట బస్టాండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా బీసీ వర్గానికి చెందిన కార్తీక్.. కొందరి మాటలు విని తన ప్రేమను అంగీకరించడం లేదని ప్రభావతి మనోవేదన గురైంది. ఈ క్రమంలో తాను పురుగుల మందు తాగుతున్నానని, తన మృతికి కార్తీక్‌తోపాటు ప్రేమను కాదంటున్న ఆయన కుటుంబ సభ్యులే కారణమని ఓ లెటర్ రాసింది. అనంతరం పురుగుల మందు తాగింది. ఈ విషయం తల్లికి తెలుపగా కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రభావతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన (పోక్సో) కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పరకాల పట్టణానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని.. లేదంటే మీ అమ్మానాన్నను చంపుతానని వరంగల్ రంగంపేటకు చెందిన వివాహితుడు మహ్మద్ సమీర్ అలియాస్ సాజిత్ 2019 ఏప్రిల్ 24న రాత్రి బెదిరించి వెంట తీసుకెళ్లాడు. 15 రోజులు వివిధ ప్రాంతాల్లో తిప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో సాజిత్‌కు జైలుశిక్షతోపాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ జడ్జి టి.జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసులు అధికారులు మధు, రవికిరణ్, వెంకటరత్నం పరిశోధించగా.. లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెచ్‌సీ సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థుల ఆందోళన



గేట్ వద్దనే భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల (ఎస్‌ఎఫ్‌సీ) విద్యార్థులు తమకు హాస్టళ్ల వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం నుంచి మొదటి గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి 11గంటల వరకు కూడా కొనసాగింది. అక్కడే బయటి హాస్టల్‌నుంచి తెచ్చిన సహపంక్తి భోజనాలు చేశారు. మహిళా హాస్టల్‌లో సెల్ఫ్‌ఫైనాన్స్‌కోర్సుల విద్యార్థులు కొందరు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఈ నెల 7న అధికారులు వారిని ఖాళీ చేయించారు. మంగళవారం కూడా పలువురు విద్యార్థినులను ఖాళీ చేయించి బ్యాగులు బయటపెట్టారని ఆరోపిస్తున్నారు. తాము ఎక్కడ ఉండి చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉందని, టైంటేబుల్‌ను కూడా వెల్లడించారని తెలిపారు. యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో హాస్టల్ వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు వివిధ విద్యార్థి సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థులు వినలేదు. వీసీ వచ్చి తమకు హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యను వివరణ కోరగా మరో 15 రోజుల్లో ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. 15నుంచి 20మంది వరకు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఖాళీ చేయించామని తెలిపారు.

పోలీసులతో వాగ్వాదం..

గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అక్కడినుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొంత తోపులాడుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పోలీసులు వెళ్లిపోవడంతో విద్యార్థులు ఆందోళన కొనసాగించారు.